మున్నేరు వరద ముంపునకు గురైన నిరాశ్రయులను పరామర్శించి, భరోసా కల్పించడానికి ఖమ్మం నగరంలో మంగళవారం పర్యటించిన బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు, మాజీ మంత్రులపై దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కాంగ్రెస్ ముష్కరుల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కారు అద్దం

పరామర్శపై రాళ్లదాడి

మొదటిపేజీ తరువాయి...

కార్యకర్తలు దాడికి పాల్పడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఉదయం 11 గంటలకు పాలేరు నియోజకవర్గం, కరుణగిరిలో ఉన్న రాజీవ్ స్వగృహ కాలనీలోని వరద బాధితులను మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. అనంతరం ఖమ్మంలోని బొక్కలగడ్డ, మంచికంటినగర్, సారథినగర్ ప్రాంతాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాధితులను పరామర్శించారు. ఈ క్రమంలో మంచికంటినగర్‌లో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టారు. బీఆర్ఎస్ నేతలు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తుండడం, సహాయక చర్యల్లో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ హయాంలోనే తమకు సత్వర న్యాయం లభించిందని, పువ్వాడ తమను ఆదుకున్నారని బాధితులు చెప్తుండడంతో తట్టుకోలేకపోయిన కాంగ్రెస్ గూండాలు కయ్యానికి కాలుదువ్వారు. తొలుత నిత్యావసర సరుకుల పంపిణీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. గమనించిన హరీశ్‌రావు తదితరులు సంయమనం పాటించాలని బీఆర్ఎస్ కార్యకర్తలను కోరారు.

పువ్వాడ కారు అద్దాలు ధ్వంసం

మంచికంటినగర్ ఆర్చి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు అకస్మాత్తుగా దాడిచేసి పువ్వాడ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో కారులో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఉన్నారు. వరద బాధితులు వారికి ఎదురుతిరిగి 'మీరు ఎలాగూ రారు.. వచ్చిన వారినీ రానివ్వారా?' అని వాగ్వాదానికి దిగారు. హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర రెడ్డి, అజయ్‌కుమార్, వద్దిరాజు, కేపీ వివేకానంద, శంభీపూర్‌రాజు, కౌశిక్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తదితరులకు వరద బాధితులు రక్షణకవచంగా నిలిచారు. దీంతో మరింతగా రగిలిపోయిన దుండగులు వరద బాధితులపై దాడిచేశారు. ఈ ఘటనలో ఒకరి తలపగిలి గాయాలయ్యాయి. కారులో తిరిగి వెళ్తున్న హరీశ్‌రావు బృందంపై మంచికంటినగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు మరోమారు దాడికి తెగబడ్డారు. పెద్ద బండరాయితో ఆయన కారుపై దాడిచేసి అద్దాన్ని ధ్వంసం చేశారు. మరో వ్యక్తి కూడా హరీశ్ కారుపై బండరాయితో రాగా బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు యావన్నగారి సంతోశ్‌రెడ్డి అడ్డుకున్నారు. దీంతో అల్లరిమూకలు సంతోష్‌రెడ్డిని కారు కిందకు నెట్టడంతో ఆయన కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. రాళ్లదాడిలో వరదబాధితులు షేక్ అఫ్జల్, అంజాద్ పాషాకు కూడా గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని ఖమ్మంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందా?

బీఆర్ఎస్ బృందంపై దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందా? అన్న అనుమానం కలుగుతున్నది. ఇద్దరు కార్పొరేటర్ల భర్తల పర్యవేక్షణలోనే దాడి జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'మిక్కిలినేని నరేందర్, ముస్తాఫా' అనే కాంగ్రెస్ నేతలే దాడికి ఉసిగొల్పినట్టు ఆరోపణలు వస్తున్నాయి. నరేందర్ సోమవారం ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో పాల్గొనడం గమనార్హం.

సీపీకి బీఆర్ఎస్ ఫిర్యాదు...

మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, డ్రైవింగ్ స్థానంలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దుండగులు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఖమ్మం నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఖమ్మం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మిక్కిలినేని నరేందర్, బాణాల లక్ష్మణ్, ఎస్‌కే యాకూబ్‌బాషా, ఎండీ షుకూర్, ఎస్‌కే యూసుఫ్, నిమ్మలబోయిన సురేశ్, ఇఫ్తికర్ హుస్సేని అలియాస్ భద్రుల్లా ఈ దాడికి పాల్పడ్డారని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు యూసుఫ్‌ను సముదాయిస్తున్న ఖమ్మం త్రీ టౌన్ సీఐ

25లక్షల చొప్పున ఇవ్వాలి

రేవంత్‌రెడ్డి గతంలో చెప్పినట్టు మృతుల కుటుంబాలకు సాయం చేయాలి

మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్.. వరద మృతుల జాబితా ఎక్స్‌లో పోస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం మానెయ్యాలని, వరదలతో చనిపోయిన వారి సంఖ్యను తక్కువ చూపించడం సీఎంకు సరికాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరదలతో చనిపోయిన వారి పూర్తి జాబితాను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నిన్న 16 మందే చనిపోయారని సీఎం ప్రకటించారని, ఈ జాబితాను తనిఖీ చేసి అన్ని కుటుంబాలకు సాయం చేయాలని సూచించారు. 'చావు లెక్కలపై అబద్ధాలు చెప్తున్న మిమ్మల్ని ఎవ్వరూ క్షమించరు' అంటూ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సిగ్గుమాలిన రాజకీయాలకు తెరదించి, ఆ కుటుంబాలను క్షమాపణ అడగాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన విధంగా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున అందించాలని గుర్తుచేశారు.

పోలీసులకు అభినందనలు

భారీ వర్షాలతో అచ్చంపేటలోని డిండి కెనాల్లో చిక్కుకుపోయిన 10 మంది గిరిజనులను కాపాడిన పోలీసులను కేటీఆర్ అభినందించారు. మూడు రోజుల క్రితం వరదల్లో చిక్కుకుపోయారని, సమయానికి హెలికాప్టర్లు పంపి ఉంటే వారంతా బయట పడి ఉండేవారని, కానీ, సీఎం ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ వస్తే కరెంటు ఉండదని ఎన్నికల ముందు నుంచే చెప్తున్నామని ఇప్పుడు పత్రికలు చెబుతున్నాయని కేటీఆర్ దుయ్యబట్టారు. 'కరెంటు కావాలా?, కాంగ్రెస్ కావాలా? అని ఆనాడే అడిగినం, కాంగ్రెస్‌కు అధికారం, రాష్ట్రంలో అంధకారం' అంటూ ఎక్స్‌లో సెటైర్ వేశారు. వర్షాలు, వరదలతో 48 గంటల పాటు కరెంటు పోయిందంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని పోస్ట్‌చేశారు. కేసీఆర్ హయాంలోనే చేపట్టిన ఎస్ఎన్‌డీపీ వల్ల ఓల్డ్ సిటీలో వరద ముంపు తప్పిందని తెలిపారు. ప్రభుత్వాలు చేస్తున్న 'బుల్డోజర్ పాలిటిక్స్' ప్రజల జీవితాలపై దాడి అంటూ సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఇదే సందర్భంలో సుప్రీం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీరు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తున్నదని ఎద్దేవా చేశారు. ఓవైపు బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధమంటూ రాహుల్ పెద్దపెద్ద మాటలు చెప్తుంటారని, అదే తెలంగాణలో తమ పార్టీ పాలనలో బుల్డోజర్‌తో జరుగుతున్న విధ్వంసంపై మౌనంగా ఉంటారని, ఇదేం ద్వంద్వ వైఖరి అని రాహుల్‌ను నిలదీశారు.

ఉనికి కోల్పోతామనే దాడులు: యావన్నగారి సంతోష్‌రెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 3: ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో వరద బాధితులను పరామర్శించేందుకు మంగళవారం వచ్చిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు, మాజీమంత్రులపై కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు రౌడీమూకల్లా వచ్చి దాడులకు దిగారు. ఈ ఘటనలో హైదరాబాద్ నుంచి వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు యావన్నగారి సంతోష్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కుడికాలు విరగటంతో దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు జరిగిన ఘటనను పూసగుచ్చినట్టు వివరించారు.

'కాంగ్రెస్ గూండాలు కర్రలు, రాళ్లు ఇనుపరాడ్లతో దాడులకు దిగారు. ముందు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాలపై దాడులకు దిగారు. ఒకడు పెద్ద గ్రానైట్ రాయి, కర్రతో హరీశ్ అన్నపై దాడికి పాల్పడేందుకు యత్నిస్తున్న క్రమంలో అడ్డుకున్నా. మరో ముగ్గురు వచ్చి నాపై దాడిచేసి కొట్టారు. నా కాలికి తీవ్ర గాయాలయ్యాయి. నడవలేని నన్ను వెంటనే దవాఖానకు తరలించారు. వైద్యులు విరిగిన కాలికి ఆపరేషన్ చేయాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్తున్నాం' అని చెప్పారు.

ప్రజలకు అండగా నిలిస్తే దాడులా?

- మీరు సాయం చెయ్యరు.. చేసేవాళ్లపై గూండాయిజమా?
- మాజీ మంత్రులపై దాడి కాంగ్రెస్ అసహనానికి నిదర్శనం
- ఇందుకు సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడిని ఖండించిన కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) 'ప్రజలకు సాయం చేయటం చేతగాక.. చేస్తున్నవాళ్లను చూసి ఓర్వలేక కాంగ్రెస్ గూండాలు దాడికి తెగబడ్డారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే.. ప్రజలకు అండగా నిలబడడమే తప్పా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ నిలదీశారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు వాహనాలపై కాంగ్రెస్ గుండాలు దాడికి దిగటం వారి అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. దాడి గురించి తెలిసిన వెంటనే హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచేందుకు ఖమ్మం వెళ్లిన పార్టీ నేతలను అభినందించారు. దాడిపై ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు ఇలాంటి దాడులు కొత్త కాదని, కాంగ్రెస్ గూండాలు ఎన్నిదాడులు చేసినా ప్రజలకు అండగా ఉండే విషయంలో వెనక్కి తగ్గేది లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త సంతోష్ రెడ్డికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు కచ్చితంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే: సిరికొండ

ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే దాడు లు చేస్తున్నారని శాసనమండి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. ఖమ్మంలో బీఆర్ఎస్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

పరిపాలన చేతగాక: మాజీ ఎమ్మెల్యే పెద్ది

పరిపాలన చేతకాక సాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని, ఇది ఆక్షేపణీయమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్‌ది దాడుల సంస్కృతి కాదని, తెలంగాణ అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని స్పష్టంచేశారు.

బీఆర్ఎస్‌ను ఓర్వలేకే దాడి: మాజీ ఎంపీ బడుగుల

ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు మద్దతు పెరుగుతున్నదనే ఖమ్మంలో కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడ్డారని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు సర్కారు తీరు: నిరంజన్ రెడ్డి

సాయం చేయలేని ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పలేక ప్రతిపక్షంపై దాడులకు పాల్పడుతున్నదని, కాంగ్రెస్ సర్కారు తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉన్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల వాహనాలపై కాంగ్రెస్ గూండాల దాడి గర్హనీయమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ దాడి పిరికిపందల చర్య

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నేతల కార్లపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం పిరికిపందల చర్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ గూండాలు దాడులు చేస్తుంటే పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని విమర్శించారు.

ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే: బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

'వరద బాధితులకు సాయం చేసేందుకు వెళ్లిన వారిపై దాడిచేసి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నరు. స్వయంగా మంత్రి కుమారుడే దాడిలో పాల్గొన్నాడంటే.. ఇది కచ్చితంగా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే జరిగింది' అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరిగినా వాళ్లు ప్రేక్షకపాత్ర వహించారని ఆరోపించారు.

బిగజారుడుతనానికి నిదర్శనం: కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలరాజు యాదవ్

ఖమ్మంలో బీఆర్ఎస్ నాయకుల వాహనాలపై కాంగ్రెస్ గూండాలు దాడిచేయడం సిగ్గుచేటని, ఇది కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనమని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు మండిపడ్డారు. ప్రజలకు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వమే భయపెడుతున్నదని విమర్శించారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి: బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్

బీఆర్ఎస్ నాయకులపై దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ డిమాండ్ చేశారు. దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు.

కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరద బాధితులను ఆదుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పనిచేద్దామని వెళ్లిన ప్రతిపక్ష నేతలపై గూండాలతో దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. ఇంతటి క్లిష్ట సమయంలో కూడా నీచరాజకీయాలు చేయాలని చూడడం వారి విజ్ఞతకు నిదర్శనమని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మున్ముందు కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు.

కాంగ్రెస్ గూండాల దాడి హేయం: ఎమ్మెల్యే పల్లా

ఖమ్మంలో ప్రజలకు సాయపడేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంపై కాంగ్రెస్ గూండాల దాడి అత్యంత హేయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

మంచి చెయ్యరు.. చెయ్యనివ్వరా?: గాదరి కిశోర్

పాలన చేతకాక ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై దాడులకు దిగుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విమర్శించారు. ఖమ్మంలో మాజీ మంత్రుల బృందంపై రాళ్లదాడి చేయడం కాంగ్రెస్ గూండాయిజానికి పరాకాష్ట అని ఉదహరించారు. మంచి చెయ్యదు.. ఇతరులను చెయ్యనివ్వదని కాంగ్రెస్ మరోసారి రుజువు చేసుకున్నదని దుయ్యబట్టారు.

ప్రజలు భీకొడుతున్నరు: భాస్కర్‌రావు

వరద బాధితులకు ధైర్యం చెప్పేందుకు వచ్చిన ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం పనికిమాలిన చర్య అని, ఈ చర్యతో కాంగ్రెస్ నాయకులను ప్రజలు భీకొడుతున్నారని నల్లమో తు భాస్కర్‌రావు మండిపడ్డారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాగిరి: చిరుమర్తి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది పాలన కాదని, గూండాగిరీ అని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు.ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డే ఎమ్మెల్యేలు, కేడర్‌కు శిక్షణ ఇస్తున్నట్టు తెలుస్తున్నదని అనుమానించారు.

రావాలంటూనే దాడులా: దేవీప్రసాద్

వరద బాధితులను పరామర్శించేందుకు ప్రతిపక్ష నేతలు రావాలని ఓవైపు ముఖ్యమంత్రి పిలుపునిచ్చి ఇలా దాడి చేయించడం దుర్మార్గమని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మండిపడ్డారు. ఎన్నిదాడులు చేసినా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలోనే నిలదీస్తామని స్పష్టంచేశారు.

ఇది రాక్షస పాలన : పల్లె రవి

'భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే గాలికి వదిలేశారు.. ప్రజలు తిరగబడిసరికి సహనం కోల్పోయి ప్రతిపక్ష నేతలపై దాడులకు తెగబడ్డారు. ఇది ప్రజా ప్రాలన కాదు.. రాక్షస పాలన' అని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పరిపాలన చేతకాక ప్రతి విషయంలో దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు.

వైఫల్యాలు ఎత్తిచూపితే దాడులా? : ఎర్రోళ్ల శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే దాడులు చేస్తారా? అంటూ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ నిలదీశారు. దాడులపై రేవంత్‌రెడ్డి స్పందించాలని, బీఆర్ఎస్ నేతలకు ఖమ్మం జిల్లా మంత్రులు క్షమాపణ చెప్పాలని, దాడులు చేసిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.7°c	23.5°c
ఖమ్మం	30.0°c	24.0°c
కరీంనగర్	29.0°c	26.0°c
రంగారెడ్డి	28.5°c	20.2°c
మహబూబ్‌నగర్	28.2°c	22.3°c
నల్లగొండ	28.0°c	23.4°c
వరంగల్	28.0°c	24.0°c
హైదరాబాద్	28.0°c	23.0°c
మెదక్	27.7°c	21.4°c
నిజామాబాద్	25.5°c	22.5°c

మరో మూడు రోజులు మోస్తరు వర్షాలు

- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా ఉన్నాయని రాబోయే 3 రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గడిచిన 24 గంటల్లో మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసినట్టు పేర్కొన్నది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

రేపు మరో అల్పపీడనం

ఏపీకి మరో అల్పపీడనం ముప్పు తప్పదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 5న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం క్రమేపీ బలపడే అవకాశం ఉందని తెలిపింది.

భారీ వర్షాలు, వరదల వల్ల సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా మార్గాలలో బుధవారం వరకు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మరి కొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

రాష్ట్రంలో గూండాల సంస్కృతి

- మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం గూండాల సంస్కృతిని తెస్తున్నదని ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు పూర్తివ్యతిరేకమని చెప్పారు.

ఓర్వలేక రౌడీ మూకలను ఉసిగొల్పిండ్రు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ఖమ్మంలో వరద బాధితులకు బీఆర్ఎస్ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పెద్దలు రౌడీ మూకలను ఉసిగొల్పి దాడులకు తెగపడ్డారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసహనాన్ని, అసమర్థతను తెలియజేస్తున్నదని దుయ్యబట్టారు. పార్టీలకతీతంగా ఈ దాడిని ఖండించాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు.

దాడికి సీఎం బాధ్యత వహించాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

తమ అసమర్థత బయటపడుతుందనే భయంతో ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలతో దాడి చేయించిందని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదల జీవితాలతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు.

ముందస్తు ప్రణాళికల్లో భాగమే..

- బీఆర్ఎస్ నాయకుడు నగేశ్ ముదిరాజ్

పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయంటే ఇది పక్కా ముందస్తు ప్రణాళికలో భాగంగానే భావించాల్సి ఉంటుందని బీఆర్ఎస్ నాయకుడు నగేశ్ ముదిరాజ్ ఆరోపించారు. దాడులు చేసిన గూండాలపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు.

బీఆర్ఎస్ సైనికులు బెదరరు

- రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

వరద బాధితుల్లో మనోధైర్యం నింపేందుకు వెళ్లిన మాజీ మంత్రులపై దాడులు చేయడం హేయమని నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు నియోజకవర్గాల్లో తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.